# 'గ్రాంధిక భాషావాది'

పరబ్రహ్మ శాస్త్రి తీవ్రమైన గ్రాంధికవాది. గొప్ప తర్క శాస్త్ర పండితుడు. పూర్వమీమాంసా ఉత్తరమీమాంసా క్షుణ్ణంగా పాఠం చెప్పించుకొన్న పండితుడు. సంస్కృతంలోనూ తెలుగులోనూ ఘట్టి కృషి చేసి మంచి భాషా జ్ఞానం అలవర్చుకొన్నవాడు కూడాను.

ఆయనకు ఈ కాలపు వ్యవహారిక భాషా రచనలంటే సుతరామూ సరిపడదు. అటువంటి వ్రాతలు కంటపడితే పండ్లు పటపట కొరికి, వ్రాసే వాళ్ళను తెగతిట్టి దుమ్మెత్తిపోస్తూ ఉంటాడు.

ఆయనవద్ద శ్రీనివాసుడను శిష్యుడు మేఘ సందేశం పాఠం చెప్పించుకుంటూ ఉన్నాడు. తెలుగు భాషకి పట్టిన దౌర్భాగ్యస్థితికా పండితుడు వగచి, ఇకమీద వ్యావహారిక భాషలో వెలువడే వ్రాతలను తాను చదవక పోవడమే గాకుండా, ప్రపంచంలో అసలు వ్యావహారిక భాష అనే స్వరూపం లేకుండా చేయాలని ఆయనకొక విధమైన ఆవేశం కలిగింది. అంటే ప్రతి మనుష్యుడూ వ్యావహారికాల్లో గూడా, వ్యాకరణ యుక్తమైన చక్కని గ్రాంధిక భాషనే ఉపయోగించడం నేర్చుకోవలెనని ఆయనగారి ఆశయం. ఈ ఉద్యమంలో ఆయన మార్గదర్శకుడుగా ఉండుటకు గాను ముందు తన శిష్యుణ్ణీ, తన భార్యనూ, పిల్లవాణ్ణీ తన మతంలోకి తిప్పుకోవడం అవసరమని, వాళ్ళను గ్రాంధిక వాదులుగా తయారుచేయడానికి పూనుకొన్నాడు.

ఆరోజు ఉదయం ఏడు గంటలకు శ్రీనివాసుడు స్నానంచేసి, విభూతి పిండి పట్టెలు ధరించి చేత పుస్తకం పట్టుకొని వసారాలో కూర్చుని ఉన్నాడు. పరబ్రహ్మశాస్త్రి గూడా స్నానం చేసి పింజపోసిన నీర్కావి ధోవతి ధరించి, విభూతి మైనిండా అలిమి, భుజాన్ని తడి అంగవస్త్రం మడిచి పెట్టుకొని ఒకచేత్తో జంధ్యాలు వడికే కదురు వగైరా సామానులు వేసిన తాటాకు బుట్టా, రెండో చేత్తో ఒక గ్రంథమూ తీసుకొని వసారాలో ప్రవేశిస్తాడు.

గురువు : రే శిష్యా! గ్రాంధిక భాషోచ్చారణ యదెంత వరక భ్యాసమైనదిరా–

నీకు?

శిష్యుడు : చిత్తము గురూత్తమా! ఇప్పటిక దశ దివసంబులుగా తదేక దీక్షా పరతంత్రుడనై యభ్యాస మొనర్చుకొన చుండినందున, నిన్న మొన్నటి కన్న నిద్దినంబున కడుంగడు వృద్ధి బొందెనని నొక్కి వక్కాణింప గలాడను దేవా.

గు : సంతసము. అభ్యాస వశంబున బ్రహ్మవిద్యము హస్తగతంబు. ఏ తత్కృషి యందీ వప్రమత్తుండవై మెలంగ వలయు లేనిచో కార్య సాఫల్యంబు బడయ జాలవు.

శి : చిత్తము.

గు : నీకు నే నొక్క చక్కని హితోపదేశంబు జేసెద. సావధాన చిత్తుండవై యాలింపుము. ఏ తద్రహశ్యంబు గ్రహింప నోపితివేని, నీవు దిగ్విజయుండవు కాగలాడవు. నీవు చక్కని గ్రాంధిక భాషోచ్చారణ యందు ఉత్తీర్ణుడవు కాగల పర్యంతము, పరపురుషులతో నీకుం బనిలేమి బయటకు పోజనకుము ఒకానొక తరి, బయటి కొక నెపంబున పోవలసియుండి పోయినను, నీవు గ్రాంధికమునే గాని వ్యావహారికము నుచ్చరింప నని శపథంబు చేసికొనుము.

శి : దేవర నా కిన్ని విధంబుల బోధింపవలెనే. అస్మద్గృహంబున మదీయ జననీ జనకులాది యాప్తబందు వర్గం బింకనూ గ్రాంధిక భాషా ప్రయోజనంబు గ్రహింపనేరక, నీచ వ్యావహారిక భాషా ప్రమత్తులై చరించుచుండ నే నది సహింప నోర్వక యిప్పటి కేడు వారంబులుగా తీవ్రమైన మూగనోము వహించి, వారలతో చేసైగనేగాని నోట మాటాడ మానితిని గురూ! ఈ దీనుడునూ తన యోపినంత దనుక మెళుకువ తోడనే ప్రవర్తించుచుండె.

గు : లెస్స! శిష్యా : మదీయ హస్తగతంబైన యీ చిరు పొత్తంబు! తిలకించితివా?

శి : ఏ తద్గ్రంధ రాజంబు నామ ధేయం బెద్ది గురూత్తమా!

గు : గ్రంధరాజంబని శ్రేష్ఠ వాచక ప్రయోగంబు గురిపించితివా? ఇది యొక నీచాతి నీచ గ్రంధము.

శి : అటులనా? తన్నామధేయం బెద్ది గురూ!

గు : భావ కవుల ఖండ కావ్య సంపుటి యట!

శి : ఔరా! భావ కవుల హస్త గతంబున బడి యాంధ్ర భాషా యోష యదెంత ఖిన్న వదనాబ్జయైనదో!

గు : భావ కవిత్వమట!

శి : కల్పనా కధలట! నా శ్రాద్ధమట. నా పిండాకూడట. (అని పళ్ళు పట పట కొరుకును)

గు : భావ శూన్యులకు భావ కవిత యేల?

శి : అభావ కవులు, నిర్భాగ్యపు కవులు.

గు : ఆహా! ఆంధ్రభాషామ తల్లి నేడెంత గొడ్డుపోయిన దోయీ! ఆ తల్లి మర నొక పెద్దన్నను, నొక తిక్కన్నను, నొక తిమ్మన్నను కాన్పు గనలేదో!– కాల వైపరీత్యము. నూతన వృత్తముల పేరిట, లయగణ యతిప్రాస శూన్యమైన వ్రాతలు చెలరేగుచుండెగదా! నాక పదంబు నుండి యిట్టి వ్రాతలను దిలకించి మన యప్పన్న యెంత దురపిల్లుచుండెనో గదా, శ్రీనివాసా!

శి : అయ్యో! స్వామీ!! ఏమని వచింప గలాడనూ. ఈ నాటికి ముద్దినంబులకు పూర్వం బొకానుక రేయి సరస్వతీ మాత నాకు స్వప్నగతంబై, భావకవుల వ్రాతల దలంచినా మ్రోల వెక్కి వెక్కి యేడువ సాగె:

గు : (ఆశ్చర్యముతో) ఔనా, నిక్కువమా! సరస్వతీ మాతయే స్వప్నంబున సాక్షాత్కరించెగా!

శి : అయ్యో! ఏమని వచింప గలాడను స్వామీ! ఆ తల్లిన తిలకింతు గదా:. జీర్ణదేహయై యాపాద మస్తకంబు గృశించి, జీర్ణవస్త్రధారిణియై దిక్కుసెడిన వొరి నిరుపేద రాల్లాగా ఉందిస్వామీ– (అని తటాలున నాలుక కరచుకొనును)

గు : (కోపముతో) రే. మూర్ఖా, ఏమా మందపాటు ఇట్టి దుఃఖ సాగరమున మునిగి యుండిన నీ కింకనూ తొంటి వ్యావహారిక భాషోచ్చారణా జాడ్యం బంతరింపదో!

శి : (గడ గడ వడకుచు – లెంపలు వాయించుకొంటూ) బుద్ధి బుద్ధి

గురూ. క్షమింప గర్తలు. స్వప్నగతంబైన సరస్వతీమాతా స్వరూపంబు తిరిగి నా కిప్పట్టున హృదయ గోళంబున దృగ్గోచరంబు కాగా దుఃఖో ద్రేకంబున మనస్సు చెడి పొరపాటున నోరు జారి యిట్లంటిని దేవా.

గు : ఆ తల్లి నీతో నేమని భాషించెనో?

శి : వా తెరచి పల్కుట కక్కాంతామ తల్లికి దుఃఖో ద్వేగంబున స్వరంబు మూతబడ నిర్మాటయై–

గు : నిర్మాట యేమిరా! మూర్ఖా!

శి : నోట మాట రానిదై యని నా యర్థము దేవా : ఆ తల్లి నిరుత్తరమై, నిశ్చేష్టయై నా మ్రోల నిలువంబడి వల వల కన్నీటి ధార ప్రవాహంబు గజతుండంబు చాడ్పున కన్దోయి నుండి విడుచుచూ, వెక్కి వెక్కి ఏడ్చుచుండ నా సాధ్వీలలామ దుఃఖంబు చూడ నోపక–

శిగు : అయ్యో! నా తల్లి కెంత కష్టమెంత కష్టము– ( అని కన్నీరు యిడుచుకొనును)

: నేను తక్షణం బామె పాద పద్మంబుల వ్రాలి "ఏటి కీ దుఃఖము. కారణంబు శలవీయం జనదో" యని ప్రార్థించితి.

గు : తల్లి సమాధాన మెద్ది?

శి : ఆ తల్లి చేతులెత్తి నన్ను లేవనెత్తి, మచ్ఛీర్షంబు తన హస్త కమలంబుల నిమిరి, ప్రమేదళ్ళొత్త "శ్రీనివాసా!" యని నన్ను సంబోధించె.

గు : నిక్కంబుగా నీవు ధన్యుడవోయీ. పదంపడి నేమి జరిగెనో విన కుతూహ లాయత్త మానసుండనై యున్నాడ.

శి : శ్రీనివాసా. మత్పుత్ర సముండవగు నో ఢింభకా! నీవునూ, భవద్గురు పాదులు శ్రీశ్రీశ్రీ పరబ్రహ్మశాస్త్రియు

గు : ఆహా! ఆ తల్లి మన్నామ ధేయంబు గూడ పేర్కొనియెగా! తర్వాత, తర్వాత

శి : "మీ రుభయులు కలిసి నన్ను నూతన యుగారంభమున చెలరేగి పీడించు భావకవుల బారి నుండి తప్పించి రక్షింపలేరో" అని ఆమె నన్ను కౌగిలించుకొని మరల మరల నేడువసాగె.

గు : ఆహా! నెడెట్టి దుర్దినము శ్రీనివాసా – ఇంతటి దారుణ వాక్యములు మదీయ శ్రవణపుటంబుల జొచ్చినను మదీయ హృదయ గోళంబు

పాషాణ రూపంబున ద్రవ్యులు గాక యున్నదే.

శి : దేవా! అవధరింపుడు. "తల్లీ నీ యనుగ్రహంబు కలిమి మాకుం జయంబు కాగలదు. ఇటీవలనే మద్గురుపాదులు తమ స్వగృహంబున గూడ గ్రాంధిక భాషా ప్రయోగంబు జేయ సాహసించిరి. ఇక క్రమంబున వ్యావహారిక మాంధ్ర దేశంబు నుండి పలాయనంబు చిత్తగింప గలాదు - ఊరడిల్లుము జననీ." అని నేను వినయ వినమితాంగుండనై బల్కితిని.

గు : మేలు శ్రీనివాసా. మేలు! తల్లికి చక్కని ప్రత్యుత్తరం బెచ్చితివి.

శి : గురూ! ఈ భావకవుల కేటి కింకను లజ్జ జనింపదు.

గు : వినాశకాలే విపరీత బుద్ధి:

: దేవర యానతిచ్చినది నిజంబ. లేకున్న వీరికీ ఖండ, కావ్య సంపుటి యేల. మదీయ కరవాలంబుచే వీరి ఖండకావ్యంబులు ఖండ ఖండములుగా చీల్చివైచి, సరస్వతీమాత మ్రోల మంగళ హారతి పట్ట నాకుం కదుం గదు కుతూహలంబయ్యో - లేకున్న వీరికీ కల్పనా కధలేల, ఈ పిచ్చివ్రాతలేల; ఈ జాడ్యమేల!

గు : శిష్యా! ఈ నవీన కవి బ్రువులు గ్రాంధిక వాదులనేగాక మహాతల్లి సరస్వతీదేవిని గూడ ఎంత యేడ్పించు చుంటిరో పాపభూయిష్టులకే శిక్ష విధించినను దోష లేశం బుండబోదు.

శి : నిక్కంబ. కాని యిట్టి శిక్షల నొసంగు దండనాధికారి లేదనియే నా దుఃఖము.

గు : రాజాధిరాజులు మహారాజపోషకులు - భోజుడు, శ్రీకృష్ణ దేవయాది రాజపుంగవులు లేకుంటచే గదా, యిట్టి భావకవులు బయలుదేర కారణంబయ్యె.

శి : అబ్బే. అట్లాంటి వారీకాలంలో లేరు సామీ!

(అని మరల తటాలున నాలుక కరచు కొనును)

గు : మరల మరల నీకీ రోగ మేమి శ్రీనివాసా!

శి : బుద్ధి బుద్ధి గురూ - చిరకాలాభ్యాస వంశంబున నలవడిన దుర్గుణంబులు చిరకాల సద్గురు సేవ వలనగాని నశింప నేర్చునే. భవిష్యత్తున మీ చరణ దాసుండప్రమత్తుండై సంచరింపగలాడు.--

ఈ దొసగు క్షమింపుడు-

గు : ఇంతటి నుండి పరిశుద్ధ గ్రాంధిక భాషనుగాని, నీచ వ్యవహారికము నోట నుచ్చరింపనని మరల నొకపరి నా మ్రోల శపధంబు చేయుము.

శి : సద్గురు చరణంబు లాన. భవచ్చరణ దాసాన దాసాధము డిదే మనో వాక్కాయ కర్మ భిః త్రికరణ శుద్ధిగా ప్రణామ శతంబు లాచరించి ప్రమాణ సహస్రంబు గావించుచుండె; దేవా! ఆశీర్వదింపుడు, జాగ్ర దవస్థనుగాని, సుషుప్తావస్థనుగాని, స్వప్నావస్థను గాని, భూమిని గాని, నింగిని గాని జలంబున గాని, అగ్నిని గాని, యబ్ధి యందుగాని, పర్వతంబుల గాని, ఇంట గాని, బయట గాని, రచ్చగాని, బజారున గాని, సంతను గాని, స్త్రీ యొద్ద గాని, పురుషునొద్దగాని, పశువుల చెంతగాని, పక్షుల చెంతగాని, మరి యెచ్చటగాని - దేవా. ఈ మీ శిష్య బ్రువుండు వ్యవహారిక భాష నోట నుచ్చరింపడని యిదే ప్రమాణంబు చేసెడిని. ముమ్మాటికి ప్రమాణంబు.

గురువు : మేలు. శ్రీనివాసా మేలు. నీ గురుభక్తికి కడుంగడు సంతసించితిని. నీకుం జయ మగుగాక -లెమ్ము (తెరలో) అబ్బాయీ- తొందరగా మొఖం కడుగుకొని చద్దన్నం తినవుటరా! (అను మాటలు)-

గు : వింటివా శ్రీనివాసా! నీ వంటి శిష్యోత్తములు నా మ్రోల ఘోర ప్రమాణంబులు నిరాటంకంబుగా జేయుచుండ, నీ మూర్ఖురా లెట్లు వ్యవహారిక భాషనే యింకనూ యుపయోగించుచున్నదో.

శి : చిత్తము గురువర్యా! స్త్రీలు చంచల స్వభావలు నా వినమో-

గు : కానోపు - కాని మనము మన యింటనే జయము సాధించనిది రచ్చం గెలువ గలారమే! మే మగ్ని సాక్షిగా పరిణయం బాడిన యొక్క స్త్రీని వ్యావహారిక భాష నుండి గ్రాంధిక భాషకు మరల్ప జాలనిచో, నింక లోకంబునెట్లు సవరింప గలారమో యూహింపజాల కున్నాడ! (అమ్మా! నాకు బొగ్గుపొడి వద్దే. పళ్ళు నల్లగా పోతాయీ) అని తెరలో జవాబు.

గు : వింటివా శ్రీనివాసా! ఈ శుంఠ ప్రేలు కారుకూతలు- అంగుష్ఠ మాత్రంబు లేదు. వీని కిప్పటినుండి వ్యావహారిక భాషా

వ్యామోహమేలనో! దుర్గ్రాహ్యంబు గదా.

శిష్యుడు : స్వామీ. ప్రప్రధమమున అమ్మగారిని -

గు : సంధు లేల విడదీయుదువురా - ప్రప్రధమమున నమ్మగారిని - యని యన లేవో-

శి : ప్రప్రధమమున నమ్మగారిని, కుమార రత్నంబును తమ మతా వలంబులుగా జేసినగాని భవత్సంకల్ప సంజనిత గ్రాంధిక భాషా విజృంభణము తుదముట్టనేరదు-

గు : నిక్కము వక్కాణించితివి. యస్మద్గృహిణీమణి నిటు నొక సారి జీరుము-

శి : చిత్తము ( అని నిష్క్రమించును.)

రంగము -2

(దొడ్లో భావి దగ్గర.)

శి : అమ్మా!

గురువు భార్య : ఏమిరా?

శి : భవద్భర్తయు, నస్మద్కర్తయు నగు శ్రీ గురు పాదులవారు మిమ్ముం జీరుమని యాజ్ఞ.

గురువు భార్య : ఏమిటిరా?

శి : లేదు మాతా లేదు. ఇందు మీ శిష్యుండు లేశమాత్రంబు కల్ల వచింప నోపడు.

గు.భా : లేకపోవడ మేమిటిరా?

శి : తల్లీ. తాము శాంతించి సావధాన చిత్తవై యాకర్ణింప ప్రార్ధన.

గు.భా : వెధవ గోల వచ్చిపడింది నా యింట్లో. నీతో నే కూర్చోలేను, నాకు ఎండపడుతోంది.

శి : మాతా శాంతింపుము, శాంతింపుము, సద్గురువరేణ్యుల మత ప్రాచర సార మింతదనుక భవన్మనోవీధి కెక్కినట్లులేదే!

గు. భా : ఏమిటిరా ఎక్కడం?

శి : అయ్యో తల్లీ! గ్రాంధి కాంధ్రమును గాని నోట మాట వచింప

జాలనని నస్మద్గురువ రేణ్యులు కంకణము దాల్చిరే!

గు.భా : కంకణాలా! తాల్చడమేమిటి? జంధ్యాలు తాల్చుతారు గాని, కంకణాలు తాల్చడమేమిటి నీ తలకాయ-

శి : (తనలో) అహో! కంకణములన్న నీ దేని వైవాహిక కంకణంబుగా గ్రహింప నోపు. ఏమి యీ యబల యమాయకత-

గు.భా : - ఏమిటి గొణుగు కొంటున్నావు?

శి : అమ్మా! దేవ దేవేరివై తమ రేటి కిట్లింకను పెరటిమార్గంబునే యుంటిరి.

గు.భా : నాకు స్నానం అయి మడి గుడ్డ లారవేసుకొనేవరకూ పెరటిలోనే పని. నువ్వు అవతలకి విరగడైపో.

శి : (తనలో) అయ్యో! ఈపెతో నాకు శిరంబు బ్రద్దలు కొట్టుకో యోగము తటస్థించెనే (పైకి) అమ్మా! తా మొకపరి భవద్భర్తమణి సాన్నిధ్యంబున కేతేర ప్రార్థితువు.

గు.భా : ఏమిటిరా - వెధవగోల - అబ్బాయీ చద్దన్నం తిందువుగాని రా.

శి : తమ రేటి కిట్లింకనూ వ్యావహారికమునే వాక్రుచ్చు చుంటిరే. గురువులు కుపిత మనస్కులు కాగలరు.

గు.భా : సరిగా మాట్లాడరా. నీ భాష మండిపోనూ.

శి : అమ్మా గురువునాజ్ఞ మీర రాదనిగదా వేదఘోష. నా నుడువు లాలింపుడు. తామొక పరి సద్గురు వరేణ్యుని సాన్నిధ్యంబున కేతేర శిష్యుడు వినయ వినమి తాంగుండై పునః ప్రార్ధనంబు సల్పుచుండె.

పిల్లవాడు : అమ్మా. ఏమిటే శ్రీనివాసుడు నాటకంలో వేషాలు వేసినవాళ్ళు మాట్లాడినట్లు మాట్లాడుతున్నాడు.

గు.భా : వాడి శ్రాద్ధం నా శ్రాద్ధమునూ.

శి : అమ్మా. భవద్దాసాన దాసాధముని యెడల దోషలేశం బుండబోదు. గురుచరణ సేవాతత్పరుండ నగుటచే తదాజ్ఞోల్లంఘనము మహా పాతక హేతువని యార్యఋషులు వక్కాణించిన నుండి వీటిం బుచ్చ నొల్లక యీ దీను డిట్లేతెంచె. తాము సత్వరంబ విజయంబు చేయ పునః పునః ప్రార్థితవు.

గు.భా : తలకాయ పగల కొట్టుతాను. కొంటె ముండాకొడకా. నాతో వేళా

కోళామా ఏమిటి?

శి : అయ్యో దైవమా నే నిప్పుడేమి సేయం గలాడను. ఈ మహా సాధ్వీమ తల్లి నన్ను తప్పుదలచెనే. ఏది వెరవు? ఎవరి నా(శయింతు? ఎవరి వేదుదు.

పిల్లవాడు : (నవ్వుతూ) అమ్మా. ఇట్లా అంటున్నందుకు వీణ్ణీ రోజున నోటిలో పొడు. రోగం కుదురుతుంది–

శి : అహో. ఇబ్బాలుడు గూడ నా యెడ ఘోరవైర మూనెనే. ఇయ్యిద్దరితో నే నిప్పట్టున నెవ్విధంబున కయ్యంబున కియ్యకొందు. సాధ్వీలలామా! ఈ దీనుని కరుణింపుమా – మీ పాదంబు లా(శయించెద – (అని ఆమె పాదముల మీద బదును).

గు. భా : నన్నేం చేయమంటావురా ఇప్పుడూ?

శి : ఏం చేయ మనేది ఏముంది తల్లీ. ఆయన నా ప్రాణాలు కొరికేస్తున్నాడు. ఈ భాష నోటపట్టక చచ్చిపోతున్నాను. పొరపాటున ఎప్పుడయినా మామూలుమాట నోటినుండి జారిపడితే ఆయన బడితె తీసుకొని నా మీదికి దూకుతాడు.

గు.భా : అందుకని నీవు చెప్పేది ఏమిటి?

శి : ఏముందీ? ఇక మీద మనందరం గ్రాంధిక భాషనే మాట్లాడాలట.

గు.భా : గ్రాంధిక భాషంటే?

శి : వ్యాకరణంతో కుట్టిన భాష!

గు.భా : వ్యాకరణం అంటే?

శి : అయ్యో! యెంత యమాయకురాలవు తల్లీ! వ్యాకరణ మంటే ఏమిటో ఎరగవా. అసలు భాష కంతకీ ప్రాణం పోసే ఆధారం వ్యాకరణమే గదా.

గు.భా : వ్యాకరణ మంటే ఏమిటో ఏడవరా!

శి : వ్యాకరణ మంటే భాషలో సంధులను కలిపే సూత్రాలు!

గు.భా : సంధులంటే?

శి : అంతటి మహా పండితుడు మా గురువుగారితో ఇంతకాలంగా సంసారం చేస్తున్నావు సంధులుగూడా ఎరగవా తల్లీ! ఉత్తున కచ్చు పరమైనప్పుడు సంధి నిత్యంగా వస్తుందే, అదే సంధి–

గు.భా : నా దగ్గర వెధవ కూతలు కూశావంటే నోట్లో పొడుస్తాను. ఉత్తేమిటి

నీ శ్రాద్ధం.

శి : అ, ఆ, ఇ, ఈ, ఉ అనే అక్షరం ఉండలేదూ, ఆ అక్షరంలో అంతమయ్యే పదానికి అచ్చుపరమైతే-

గు.భా : అచ్చేమిటి, అచ్చూ కుచ్చూను?

శి : ఇక నేను గొంతుకి ఉరిపోసుకొని చావాలసిందే. అచ్చంటే, మనం మాట్లాడేటప్పుడు,ఓష్ఠం అంటకుండా పలుకుతామే అక్షరాలూ - ఆ అక్షరాలే అచ్చులు -

గు.భా : ఓష్ఠం అంటే?

శి : అయ్యో తల్లి! ఓష్ఠ మంటే కూడా ఏమిటో ఎరగవమ్మా: స్త్రీలకు అధరోష్ఠంలో అమృతం ఉంటుందని శాస్త్ర ప్రామాణ్యం కూడాను.

గు.భా : అధ రోష్ఠ మేమిటిరా, నీ మొఖం మండా.

శి : ప్రతి స్త్రీకి రెండు ఓష్ఠా లుంటాయి. అందులో ఒకటి అధరోష్ఠం, ఇంకొకటి ఊర్ధ్వోష్ఠమూను. నాకైతే ఎన్నడూ, అనుభవింపలేదు గాని, స్త్రీకి అధరోష్ఠంలో అమృతం ఉంటుందని కాళిదాసు వంటి మహాకవీశ్వరుడే ఒప్పుకున్నాడు.

గు.భా : అమృతం ఉండడ మేమిటిరా: అసలు ఓష్ఠం అంటే ఏమిటో నాకింతవరకూ తెలియనే తెలియలేదురా - నీ తల బ్రద్దలుగానూ-

శి : అబ్బా: ఓష్ఠం అంటే మూతిమీద ఉండే పెదవులు. క్రింది పెదవీ, పై పెదవీని. ఇప్పుడయినా తెలిసిందా లేదా తల్లీ.

గు.భా : ఇప్పుడు పెదవులు సంగతెందుకు వచ్చిందీ?

శి : అమ్మా. నీకొక నమస్కారం చేస్తాను. ఆ సందేహాలన్నీ తీర్చడం నా వల్లకాదుకాని, అయ్యగారు మిమ్మల్ని రమ్మన్నారు. -ఒకసారి రండి. వారు వాకిట్లో కూర్చున్నారు.

(తెర ఎత్తగా)

గు.భా : (ప్రవేశించి) ఎందుకండీ రమ్మన్నారట. తొందరగా చెప్పండి వెళ్ళాలి. స్నానంచేసి మడిగుడ్డ లారవేసుకోవాలి.

గు :ధీ . మూర్ఖిణీ - మరల మరల వ్యావహారికమునే యుచ్చరింతువు నా మ్రోల - నీ నాలుక వేయి చీలికలుగా చేసెదను జూడుము.

గు.భా : నా నాలిక కోయడ మెందుకూ? మీ నాలికే కోసుకోండి. నేనిప్పుడేమన్నానని ఆ ధుమ ధుమలు.

గు : ఛీ. ఎదురాడిన నే నోర్వ జాల భద్రము – వ్యావహారికాంధ్రమును విసర్జించలేవో, అమృతప్రాయమైన ఆంధ్ర బాష నీ నోటబడి అధ్వాన్నమైపోయెనే. చక్కని వ్యాకరణ యుక్తమైన గ్రాంధి కాంధ్రమును వచింపజాలవో – మూర్ఖిణీ–

గు.భా : నాకు తెలియదమ్మా. వ్యవహారాలేమిటో గ్రాంధికా లేమిటో; మీరూ మీరు చూసుకోండి, ఆ వ్యవహారాలూ వల్లకాదూనూ.–

శి : తల్లీ! కోప ముపశమింపుము – అస్మద్గురుపాదుల వారొక మహత్తర కార్యభారంబు మూపున వైచికొని ఆంధ్రలోకంబు నామూలాగ్రంబుగా సవరింప కంకణము దాల్చినారు తల్లీ. ఇందుకు గృహిణీత్వము వహించిన తాము సర్వదా చేయూత యొసగి సద్గురువుల పూన్కి నెరవేర్ప సమకట్టవలె.

గురువు : నా యీ శిష్యుని కున్నంత జ్ఞానలేశం బర్ధాంగివైన నీకు లేకపోయెనే యని నా దుఃఖము.

పిల్లవాడు : అమ్మా! ఇదేమిటే! నాన్న ఇట్లా మాట్లాడుతున్నాడు.

గు.భా : ఏమో నాకు తెలియదు నాయనా. వ్యవహారాలట గ్రంధాలట నా శ్రాద్ధాలట.

గు : ఇబ్బాలుడు నీచే భ్రష్టుడుగా చేయంబడుచుండె. నా యంతటి పండిత మ్మన్యుని గర్భవాసంబునం బడి ఈ శుంఠ కిప్పటి నుండి వ్యావహారిక భాషా వ్యామోహమేలనో దురూహ్యంబుగా దోచుచుండె.

గు.భా : వాడు మీ గర్భవాసాన్ని పడలేదు. నా గర్భవాసాన్నే పడ్డాడు. మీరేమీ విచారించకండి.

గు : ఛీ! ఛీ! వలదన్న కొలంది మరల మరల వ్యావహారికమునే నోట నుచ్చరించినచో మదీయ ముష్టి ఘాతంబుచే త్వదీయ వీపుభాగంబు––– (అని లేచి ఆమె వీపుమీద గ్రుద్దబోవును)

గు.భా : – అయ్యో! (అని ఏడ్చును)

శి : (ఇరువురికి నడుంగా అడ్డువచ్చి) ఓహో పురాణ దంపతులారా! మీరిట్లు ముష్టి యుద్ధంబునకుం దొరకొని నందులకు చతుర్దశ భువనంబులు తల్లడిల్లుచున్నవి. సూర్యభగవానుడు మింట వెలుంగ జంకి గ్రుడ్లు మిటకరించుచుండె. సప్త సాగరంబు లొక్కుమ్మడి ఘూర్ణిల్లుచుండె. శాంతింపుడు. శాంతింపుడు.

గు : ఇంకనూ శాంతమా! ఇంకెక్కడి శాంతము. ఎంతకాలమీ శాంతము. ఇమ్మానిని మణిని తనివితీర నొక్క శిక్షించినగాని క్రోధనలదంద హ్యమానమైన మదీయ హృదయ వేదన చల్లార నేరదు. శాంతమా! పొమ్మావలకు, దయాశౌచ ధర్మంబులారా! మీకు నాకు కడుంగడు దూరము. హృదయమా! కర్కశత్వము వహించి గ్రాంధిక భాషోద్ధరణకై ముందంజ వేయుము. మనమా, నిశ్చలవై యిషణ త్రయంబులలో నొకటి యగు దారేషణను తోణంబ తరిమి వేయుము.

కరకమలంబులారా! అల్లదిగో తిలకింపుడు. ఆ మూలనుండు పొరక కట్టనే తాత్కాలిక కరవాలంబుగా గైకొని యివ్వనితా లలామకుం బుద్ధి గరుపుడు. (అని కూర్చున్న మనిషి లేచి చీపుర కట్ట తీసుకొని రావడానికి బయలుదేరాను.)

గు.భా : ఇదిమరీ బాగుంది. ఏమిటీ నాటకం! ఈ చిందు లేమిటి? ఎవరన్నా చూస్తే నవ్వుతారు.

శి : అహో! విషయము విషమించెనే. గురువులు సంపూర్ణాగ్రహ గ్రహులయిరే. ఇంకేది దిక్కు. ఎవరిని ప్రార్థింతు. దయామయా! కాశీ విశ్వేశ్వరా! మదీయ సద్గురువరేణ్యులు త్రినేత్రుని భంగి తేరిపార చూడ శక్యంబు గాక, క్రోధమూర్తులై వెలుంగుచున్నారు. నీ కేల యింకనూ కరుణ కలుగదు; లే లెమ్ము, వేవెంటనే రారమ్ము! మద్గురు వరేణ్యుని హస్తగత చీపురుకట్ట తాడనబారి నుండి మాయమ్మను వెంటనే కాపాడుము.

ఏల యాలసించెదవు. అయ్యో! ఆ తల్లి గడ గడ వణకుచుండెనే! ఓ కృష్ణభగవానుడా! అలనాడు అక్షయ వలువలిచ్చి పాంచాలిని పాలింపవో! నేడేల కేకీ జాలము. ఆలసింపకుము. అయ్యో! ఆ కృష్ణ భగవానుడునూ ఉపేక్ష వహించెనే. అష్ట దిక్పాలులారా! సూర్య చంద్రులారా! నక్షత్రంబులారా! తారలారా! ఉడులారా! మీరేల మూకీ భావులరై యూరకుంటిరి. అయ్యో! (అని యిటునటు పరుగెత్తి గంతులు వేయును.)

పిల్లవాడు : నాన్నా! అమ్మను కొట్టుతా వటయ్యా.

శి : బాలకా – నీవు బాలుండవు. పెద్దల యెడల యవిధేయత సేయంజనదు. మీ జనకుని క్రోధాగ్ని కిందనంబుగా జనదు. వెనుకంజ వేసి యూరకుండుము.

(పరబ్రహ్మశాస్త్రి జరజర నడచి మూలనున్న చీపురకట్టను కుడిచేత్తో తీసుకోగా దానిలో తేలు ఒకటి ఆయన వ్రేలిమీద పుటుక్కున కుట్టును. ఆయనచీపురు కట్ట గభాలున పారవేసి కుడి చెయ్యి ఎడమ చేత్తో పట్టుకుని–)

గు : రే శిష్యా! రే శిష్యా! రే శిష్యా! శ్రీనివాసా! (అని యరచును)

శి : దేవా! ఏమి ఏమి?

గు : అయ్యో శ్రీనివాసా–శ్రీనివాసా (అనిచెయ్యి ముందుకు జాచుచు.)

శి : ఏమి స్వామీ. హస్తంబు నిట్లు పొడుగించుచుంటిరి ఏమి వైపరీత్యము.

గు : అయ్యో! వృశ్చికమురా. వృశ్చికము కరచినదిరా!

శి : అహో! వృశ్చికమే. నిక్కమా! రక్తవర్ణపు వృశ్చికమా లేక మేఘవర్ణపు వృశ్చికమా!

గు : ఏమో! శ్రీనివాసా క్రమంబున విషంబు కుడి హస్తంబు పై కెక్కుచున్నదిరా!

శి : ఎంత కష్ట మెంతకష్టము. స్వామీ వృశ్చిక శబ్దము గ్రాంధికమా లేక వ్యావహారికమా!

గు : అబ్బా! ఎంత బాధ! ఎంతబాధ

శి : ఇప్పుడేది వెరవు! స్వామీ! వృశ్చికము నోట గరచునా లేక వాలాగ్రంబున గల కంటకముతో గుట్టునా!

గు : అయ్యో. ఏతద్విషయంబు నాకు తెలియదురా – చేయి బ్రద్దలయి పోవుచున్నదిరా. వెంటనే చికిత్స సేయింపుము.

శి : అయ్యో సద్గురువుల కెట్టి యాపద సంభవించె. నేడెట్టి దుర్దినంబు స్వామీ, ఇద్దినంబున తామెట్టి పాడు ముఖంబు తిలకించితిరోగ దా!

గు : (కోపముతో) ఛీ! పాడుముండాకొడకా; తేలుకుట్టి చచ్చిపోతుంటే ఎగతాళిగా ఉంది నీకు తొందరగా ఏదయినా మందు తీసుకొని రారా!

శి : స్వామీ, శాంతింపుడు, శాంతింపుడు, మతి భ్రమించి తాము ధర్మ విసర్జనము చేయుచుంటిరే. నీచ వ్యావహారికము చేర రానీయకుడు!

గు : దవడపళ్ళు రాలకొడతా! నీ వ్యావహారికం, నీ శార్దం తర్వాత చూచుకోవచ్చు! తేలుబాధ జాస్తిగా ఉన్నది. మందు చూడరా (అని చెయ్యిపట్టుకొని చూపు)



సన్నజీవాలు కథలు

